భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

25, అక్టోబర్ 2026, ఆదివారం | భారత్ సమాచార్

# రోడ్డు నిర్మాణంలో లోపాలంటూ గ్రామస్తుల ఆందోళన



**భారత్ సమాచార్, మెదక్ జిల్లా**: నార్సింగి మండల పరిధిలోని శేరిపల్లి నుంచి మిర్జాపల్లి వరకు చేపడుతున్న నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పనులు నత్తనడకన సాగుతున్నాయని, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు గ్రామాల మధ్య రాకపోకలను సులభతరం చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు నిర్మాణంలో కనిపిస్తున్న లోపాలను గ్రామ పాలకవర్గం, గ్రామస్తులు పలుమార్లు కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయినప్పటికీ పనుల్లో మార్పు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు.

## బ్రిడ్జి నిర్మాణంలోనూ నాణ్యతా లోపాల ఆరోపణలు



శేరిపల్లి నుంచి మిర్జాపల్లి వెళ్లే మార్గంలో మంచినీటి బావి సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులపై గ్రామస్తులు ప్రత్యేకంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేస్తున్న పైపుల కింద నిబంధనల ప్రకారం బెడ్డింగ్ వేయడం లేదని, అవసరమైన మందం కంటే తక్కువగా నిర్మాణ పనులు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. పైపులను సక్రమంగా అమర్చకుండా వాటి మధ్య ఖాళీలు వదిలేస్తున్నారని పేర్కొంటున్నారు.



నీటి ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకొని సరైన కొలతలు, ప్రణాళికతో పనులు చేపట్టాల్సి ఉండగా, అందుకు అనుగుణంగా నిర్మాణం జరగడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీరు సజావుగా ప్రవహించేలా తగిన ఏర్పాట్లు చేయకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణంలో ఇంజినీరింగ్ ప్రమాణాలు, నాణ్యతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానాలు.. గ్రామస్తుల ఆవేదన



రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనుల్లో కనిపిస్తున్న లోపాలను ప్రశ్నించినప్పటికీ కాంట్రాక్టర్ నుంచి సరైన స్పందన రావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పనుల నాణ్యతను మెరుగుపరచాలని కోరినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. తనకు ఇష్టం వచ్చినప్పుడు పనులు చేసుకుంటానని, ఎవరికి ఫిర్యాదు చేసుకుంటారో చేసుకోవాలని కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ బెదిరిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

ప్రజాధనంతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పనుల్లో లోపాలు ఉన్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకొని, నిర్మాణాన్ని నాణ్యతతో పూర్తి చేసేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

© 2026 Bharath Samachar